## క్లుప్తంగా

### విద్యార్థులకు ఆటల పోటీలు



తెనాలిఅర్బన్: వేసవి సెలవుల సందర్భంగా కొత్తపేటలోని మహిళా గ్రంథాలయంలో శనివారం వ్యాస రచన, డ్రాయింగ్, షటిల్, ఖోఖో, క్యారమ్స్, చెస్ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిథి మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి అంజని, పి.నాగేంద్ర, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

### రంజింపజేసిన సంగీత కచేరి



తెనాలి: హేమాద్రి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన సంగీత కచేరి రంజింపజేసింది. గానవిదుషి గద్దె వెంకట రామకుమారి అష్టమ స్మారక సంగీతోత్సవంగా ఈ కచేరీలో నిర్వహించారు. స్నిగ్ధమోహన గాత్రంతో కచేరి ఆరంభమైంది. తొలుత మోహన వర్ణంతో మొదలుపెట్టి, హంసధ్వని రాగంలో వాతాపి గణపతి, జయంతి శ్రీరాగంలో మరుగేలరా వంటి వాగ్గేయకారుల కీర్తనలతో సభను రంజింపజేశారు. వీరికి వయొలిన్‌పై హేమాద్రి చంద్రకాంత్, మృదంగంపై బి.సురేష్‌బాబు, ఘటంపై ఎం.హరిబాబు సహకరించారు. అనంతరం ద్రోణేంద్ర ఫణి కుమార్ వేణునాదంతో అహుతులను అలరించారు. రామకుమారి శిష్యబృందం ఈ కచేరి నిర్వహించినట్టు అకాడమీ అధ్యక్షుడు ఎం.కోదండరామశాస్త్రి తెలియజేశారు.

### యువజన నాయకుడు కృష్ణ సేవలు మరువలేనివి



తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు మేడిశెట్టి కృష్ణ సేవలు మరువరానివని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొనియాడారు. కృష్ణ జయంతిని సముద్రాల పవన్ ఆధ్వర్యంలో శనివారం తెనాలిలో ఘనంగా నిర్వహించారు. ఐతా నగర్‌లో ఏర్పాటు చేసిన భారీ కేకును ఎమ్మెల్యే కట్ చేశారు. కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా వైద్యశాలలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బేతాళ ప్రభాకర్, సముద్రాల కన్నా, కారుమంచి సునీల్ సందీప్, జెట్టి భాగ్యరావు, వంపుగళ్ళ సురేష్, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# ఆర్బీకేలు.. రైతు నేస్తాలు

- రైతులకు యంత్ర పరికరాలు, విత్తనాలు
- నాలుగేళ్లలో విరివిగా సేవలు
- వ్యవసాయ పనిముట్లతో సహా అన్ని పథకాల సమాచారం లభ్యం
- సొంత గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందజేత




కొలకలూరులోని రైతు భరోసా కేంద్రం

తెనాలిటౌన్: రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో విరివిగా సేవలు అందుతున్నాయి. ఒకప్పుడు ఎరువులు, యంత్ర పరికరాలు కావాలంటే రైతులు మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. ఆర్బీకేలు రైతులకు వెనుదన్నుగా నిలుస్తున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సొంత గ్రామాల్లోనే రైతులకు ఎరువులు, విత్తనాలు, యంత్ర పరికరాలతో పాటు అన్ని రకాల సేవలు అందుతున్నాయి. నాలుగేళ్లలో రైతు నేస్తాలుగా ఆర్బీకేలు మారాయి. భూసార పరీక్షలతో రైతుకు స్నేహ హస్తం అందిస్తున్నాయి.

**ఎరువులు, విత్తనాలు, యంత్రాలు పంపిణీ**

ఆర్బీకేల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ట్రాక్టర్లు కూడా అందజేస్తున్నారు. ప్రతి రైతు తాము సాగు చేసిన పంట వివరాలను ఈ-క్రాప్ నమోదు చేసుకుంటున్నారు. తద్వారా తుపానులు, విపత్తులు సంభవించినప్పుడు పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం పొందే అవకాశం ఉంది. ఈ క్రాప్ సర్టిఫికెట్ ద్వారా బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. ఆర్బీకే సిబ్బంది క్షేత్రస్థాయిలో పంట పొలాలను పరిశీలించి, ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్నారు.



ఎలుకల నివారణ మందు అందజేస్తున్న ఎమ్మెల్యే

**సమాచారం**

- మండలంలో ఆర్బీకేల సంఖ్య – 19
- మొత్తం రైతులు – 6059
- రైతు భరోసా లబ్ధి పొందిన రైతులు– 4505
- రైతు భరోసా ద్వారా రైతులు పొందిన లబ్ధి– రూ.24.30కోట్లు
- ఎరువులు, విత్తనాలు అందుకున్న రైతులు – 10,050
- వ్యవసాయ పనిముట్లు, యంత్ర పరికాలు పొందిన రైతులు – 95

### సీఎం మానస పుత్రిక ఆర్బీకేలు



ముఖ్యమంత్రి మానస పుత్రిక ఆర్బీకేల ద్వారా రైతులకు మునుపటి కంటే అధిక మేలు జరుగుతోంది. రైతులకు కావాల్సిన సమాచారం ఆర్బీకేల్లో అందుబాటులో ఉంది. ఎరువులు, విత్తనాలు, పచ్చిరొట్ట విత్తనాల సరఫరా చేస్తున్నాం. పీఎం కిసాన్ నగదు పంపిణీ ద్వారా రైతులకు మేలు జరుగుతోంది.

జి.ప్రేమ్‌సాగర్,
మండల వ్యవసాయాధికారి, తెనాలి.


### నాలుగేళ్లుగా రైతు భరోసా వస్తోంది



నాకు నాలుగేళ్లుగా రైతు భరోసా నగదు అందుతోంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం ఇచ్చే నగదు సాగుకు ఉపయోగపడుతోంది. అప్పులు చేసే అవకాశం లేదు. రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలన ఉంది. రైతులు సీఎంకు రుణపడి ఉంటారు.

సూరవరపు శ్రీనివాసరెడ్డి,
రైతు, కొలకలూరు.

### అందుబాటులో ఎరువులు, విత్తనాలు



ఆర్బీకేల్లో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులను, విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందుబాటులో ఉంచుతోంది. మార్కెట్ ధర కంటే ఆర్బీకేల్లో తక్కువకే లభిస్తున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు వెంటనే నష్టపరిహారం అందజేశారు.

– అంచె రోశయ్య,
ఆదర్శ రైతు, కొలకలూరు.

## కౌలు రైతులను సచివాలయ పరిధిలోనే గుర్తించాలి

**కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ**



మాట్లాడుతున్న వై.రాధాకృష్ణ

తెనాలి: కౌలు రైతులను గ్రామ సచివాలయ పరిధిలోనే అధికారులు గుర్తించి, గ్రామ సభల ద్వారా పంటసాగు హక్కు పత్రాలను ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నెల 7న నెల్లూరులో ప్రారంభమైన కౌలు రైతు సంఘం ప్రచార యాత్ర శనివారం పట్టణంలోని అయితానగర్‌కు చేరుకుంది. మహిళా పాడి రైతులు, కౌలు రైతులు జాతకు స్వాగతం పలికారు. రైతు సంఘ నేత ములకా శివ సాంబిరెడ్డి అధ్యక్షత వహించిన సభలో రాధాకృష్ణ మాట్లాడుతూ, కౌలు రైతుల చట్టంలో భూమి యజమాని సంతకం చేయాలనే నిబంధన విధించటంతో కౌలు రైతులు నష్టపోతున్నారని చెప్పారు. యజమానులు అంగీకార పత్రంపై సంతకం చేయకపోవటంతో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావటం లేదని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో 70 శాతం కౌలు రైతులేనని, 15 లక్షలమందికి భూమి లేదని వెల్లడించారు. భూమి లేని కౌలు రైతులందరికీ కులంతో నిమిత్తం లేకుండా పెట్టుబడి సాయం రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11, 12 తేదీల్లో కృష్ణాజిల్లా తోట్లవల్లూరు నుంచి మంగళగిరి సీసీఎల్‌ఏ వరకు పాదయాత్రలో కౌలు రైతులు పాల్గొనాలని కోరారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయకులు జి.లక్ష్మీపతి, ముద్దన సాంబశివరావు, మేకల చిట్టిబాబు, జెట్టి బాలరాజు, యోగేశ్వరరావు, వేజండ్ల తబిత, వి.నాగేశ్వరరావు, తెనాలి శాంతకుమారి, కూచిపూడి శకుంతల, మేకల రజని, అత్తోట కమలమ్మ, మేకల కళావతి తదితరులు పాల్గొన్నారు.

### నేడు పుస్తకాలు, ఉపకార వేతనాలు పంపిణీ

భట్టిప్రోలు: ఆర్యవైశ్య విద్యా సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 9 గంటలకు షిర్డీ సాయిబాబా ఆలయంలో 34వ మహాజన సభ జరుగుతుందని కార్యదర్శి మానేపల్లి సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 6వ తరగతి నుంచి బీటెక్ వరకు చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు అర్జీలు పెట్టుకున్న 130 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

### ప్రారంభ రోజే 'విద్యా కానుక'

పిట్టలవానిపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు పాఠశాల పునః ప్రారంభ రోజునే జగనన్న విద్యా కానుక కిట్లను అందజేయడం జరుగుతుందని బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త తెలిపారు. ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యాకానుక కిట్లను పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ, ఈవోపీఆర్డీ పద్మజ, గ్రామ కార్యదర్శులు శ్రీనివాసరావు, గోపి, వెంకటరెడ్డి ఉన్నారు.

### బండ్లమ్మ సేవలో డీపీఓ రాంబాబు

పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో వేంచేసిన బగళాముఖి అమ్మవారిని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి దాసరి రాంబాబు, ఎంపీడీఓ భవనం మారుతీ శేషమాంబ శనివారం దర్శించుకొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు బండ్లమ్మను దర్శించుకుని, బాధ్యతలు స్వీకరిస్తే.. మంచి జరుగుతుందన్నారు. ఆయనకు దేవాదాయశాఖ అధికారి నరసింహమూర్తి అమ్మవారి జ్ఞాపికను అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గౌరీదేవి విజయకుమారి, మునీర్, కార్యదర్శి శేషగిరిరావు, ఈఓపీఆర్డీ పద్మజ తదితరులు ఉన్నారు.

## పెరియార్-సమకాలీనత సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

తెనాలి: మతాలు, కులాలుగా ప్రజలు విడిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెరియార్ ఆలోచనలు సమాజానికి చాలా అవసరమని పెరియార్-అంబేడ్కర్-పూలే-జాషువా ఫౌండేషన్ చైర్మన్ బత్తుల విల్సన్ పేర్కొన్నారు. పెరియార్ ఆలోచనలు, సిద్ధాంతాలను నేటి తరానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో పెరియార్-సమకాలీనత సదస్సులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 16న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు జరిగే సదస్సును జయప్రదం చేయాలని కోరారు. సదస్సుకు జన సమీకరణ పర్యటనలో భాగంగా శనివారం తెనాలి వచ్చిన ఆయన, స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రం ఆవరణలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. లౌకికవాదం ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న నేటికాలంలో కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఉపాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, పిట్టు కోటేశ్వరరావు, కె.రవికుమార్, దేవరపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరించిన విల్సన్

### పిల్లలు సహా తల్లి అదృశ్యం

తెనాలిరూరల్: పిల్లలు సహా తల్లి అదృశ్యంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాండురంగ పేటకు చెందిన గరికపాటి సరిత కుమారుడు గణేష్(14), కుతురు దీక్షిత(12)ను తీసుకుని ఈ నెల 8న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ కోసం ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో ఆమె భర్త శనివారం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీ టౌన్ ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

### అధిక లోడుతో వెళ్తున్న లారీకి జరిమానా

తెనాలిరూరల్: అధిక లోడుతో వెళ్తున్న లారీకి అధికారులు జరిమానా విధించారు. కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం వద్ద అధిక ఇసుక లోడుతో వెళ్తున్న లారీని ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, తన సిబ్బందితో శనివారం గుర్తించారు. లారీ యజమానికి రూ. 22 వేల జరిమానా విధించారు.



# అధునాతనం..వైద్య సేవల్లో నాణ్యం

- మెరుగైన వైద్య సేవలకు కేరాఫ్ సంగం జాగర్లమూడి పీహెచ్‌సీ
- కార్పొరేట్ హాస్పిటల్స్‌కు దీటుగా సౌకర్యాలు, సేవలు
- స్నేహపూర్వక సేవలతో పెరిగిన ఓపీ సంఖ్య




తెనాలి మండలం సంగంజాగర్లమూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

తెనాలిరూరల్: విద్య, వైద్య రంగాలకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. గత ప్రభుత్వ ఆదరణకు నోచుకోని ఆరోగ్య కేంద్రాలు.. ఇప్పుడు కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయి. సంగంజాగర్లమూడిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఈ తరహాలోనే ఉంది. భవన సముదాయం కార్పొరేట్‌కు దీటుగా ఉండడంతో పాటు వైద్య సేవలు మరింత మెరుగుపడ్డాయి. తెనాలి మండలంలోని జాగర్లమూడితో పాటు బుర్రిపాలెం, పెదరావూరు, తేలప్రోలు, జగ్గడిగుంటపాలెం, అంగలకుదురు, మల్లెపాడు, చావావారిపాలెం గ్రామాలు ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వస్తాయి. ఆరోగ్య కేంద్రంలోకి అడుగుపెట్టగానే కార్పొరేట్ క్లినిక్‌కు వెళ్లిన భావన రోగులకు కలుగుతోంది. వైద్యులకు విడివిడిగా చాంబర్లు, ఎప్పటికప్పుడు శానిటైజ్ చేస్తున్న ప్రత్యేక లేబర్ రూమ్, మేల్, ఫిమేల్ వార్డులు, ఫార్మసీ స్టోర్, ఆయుష్ స్టోర్, పరీక్షలు చేసేందుకు లేబొరేటరీ, మినరల్‌వాటర్ వంటి సౌకర్యాలు రోగులకు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఇక్కడ రోజుకు ఓపీ పది మందికి మించి నమోదయ్యేది కాదు. ప్రస్తుతం వైద్యశాలలో సౌకర్యాలు మెరుగు పడడంతో పాటు వైద్యసేవలు మరింత మెరుగుపడడంతో రోజుకు 60 నుంచి 80 వరకు ఓపీ నమోదవుతోంది. ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల ప్రజలే కాకుండా ఇతర గ్రామాల నుంచి ఇక్కడకు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ హనీఫ్ హోం డాక్టర్ విధులకు వెళ్లినా, ఇద్దరిలో ఒకరు ఖచ్చితంగా పీహెచ్‌సీలో రోగులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి శుక్రవారం డెంటిస్ట్, ప్రతి శనివారం డెర్మటాలజిస్ట్ అందుబాటులో ఉంటున్నారు. వైద్యులతో పాటు సిబ్బంది తమతో స్నేహపూర్వకంగా మెలుగుతున్నారని రోగులు చెబుతున్నారు. సంగం జాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ, ఇక్కడ లభిస్తున్న వైద్య సేవలపై రోగులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కార్పొరేట్ క్లినిక్‌ను తలపిస్తున్న ఆరోగ్య కేంద్ర



రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

### మెరుగైన సేవలు అందుతున్నాయి



సంగం జాగర్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రత్యేక దృష్టి పెట్టారు. నూతన భవనాన్ని ప్రారంభించడంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందేలా చేశారు.

– పాటంశెట్టి నాగరాజు,
సంగంజాగర్లమూడి

### వైద్య సేవలు బాగున్నాయి..



మా ఊరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసేవలు బాగున్నాయి. వైద్యులు ప్రతి రోజు అందుబాటులో ఉంటున్నారు. వైద్యం చేయడంతో పాటు మందులు ఇచ్చి వైద్య సలహాలు ఇస్తున్నారు. సిబ్బంది ప్రవర్తన బాగుంది.

– చింతా సత్యనారాయణ,
సంగంజాగర్లమూడి.

### నిత్యం రోగులకు అందుబాటులో..



ఆరోగ్య కేంద్రంలో ఇద్దరం మెడికల్ ఆఫీసర్లు ఉన్నాం. ఫ్యామిలీ డాక్టర్‌కు ఒకరు వెళ్లినా మరొకరు అందుబాటులో ఉంటున్నాం. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అందరం కృషి చేస్తున్నాం. గతం కంటే ఓపీ పెరిగింది.

– డాక్టర్ హనీఫ్,
మెడికల్ ఆఫీసర్.